# ఆంధ్రా తుగ్లక్ లేక మా పిచ్చి మావయ్య

**మా**కో తుగ్లక్ మావయ్యున్నాడు. ఆయన్ని అంతా గౌరవంగా ఆంధ్రా తుగ్లక్ గారంటారు. తుగ్లక్ మావయ్య వస్తున్నాడంటే ఒక్క సంశయ మహావటవృక్షం కదిలివస్తోందన్నమాట.

అగ్గిపెట్టి చూయించి-మావయ్యా ఇది అగ్గిపెట్టి అవునా కాదా అంటే ఖచ్చితంగా ఇది అగ్గిపెట్టి అని మా మావయ్య అనలేడు. అది అగ్గిపెట్టిలా కనిపిస్తోంది. కాని కాకపోవచ్చునే అమ్మాయీ అంటాడు. పోనీ ఇప్పుడు టైం ఎంత? ఏడున్నరేనా అంటే "ఏడున్నర" అనేది సంశయాత్మక మంటాడు మా అంకుల్. కాలం అనంతమైనదే అమ్మాయీ, ఈ గడియారము చూసి ఏడున్నర అంటున్నాము, కాని దీన్ని నమ్మమని ఎవడు చెప్పాడు? అని కాలచక్ర పరిభ్రమణాన్ని గురించి గంట లెక్చరిచ్చి అందరి మతులూ పోగొడతాడు. తుగ్లక్ మావయ్యతో పేచీ ఏమిటంటే అతను ఏదీ అవునూ కాదు అని తేల్చిచెప్పడు. ఇది అవును ఇది కాదు అని చెప్పడానికి మనకు అధికారం లేదంటాడు.

వంకాయ కొత్తిమీర కారంపెట్టి వండనా, వేయించనా అని మా అత్తయ్య అడిగిందనుకోండి. కొత్తిమీర, కారం గురించి ఆంధ్ర విజ్ఞాన

సర్వస్వంలో ఏముందో చూడమంటాడు ముందు. ఏ పనిచేసినా బహు గ్రంథ పరామర్శనము చేసి చేయాలి కాని "మీ అమ్మ చెప్పింది కదా అని కొత్తిమీర కారంపెట్టి వండకూడదే అజ్ఞానురాలా" అని మా అత్తయ్యను కోపతాడడు. అతను క్షురకర్మ చేయించుకునే వేళలో ఆ క్షురకర్మకారుడు "యోగవాశిష్టం" గురించి తెలుసుకోనందుకు వాడి అజ్ఞానానికి మండి పడ తాడు. బ్రెజిల్‌లో కాఫీ పండుతుందని తెలియనివాడు కాఫీహోటలు పెట్ట డానికి వీల్లేదంటాడు. బజారుకెళ్ళి నాలుగు కప్పులూ,సాసర్లూ పట్టమ్మంటె పింగాణీ పరిశ్రమ గురించి చదివి నోట్సు రాసుకోందే బజారు కెళ్ళి లాభ మేమిటంటాడు. దేనికైనా జ్ఞానం తొలిమెట్టు. మా మావయ్య అత్తయ్యను పెళ్ళాడకముందు ఒకసారి పెళ్ళి చూపులకని వెళ్ళి పెళ్ళి కుమార్తెను "పురుడు దాని పుట్టుపూర్వోత్తరాల గురించి" ప్రశ్నలడిగాడు. ఆ అమ్మాయి కళ్ళు వాచిపోయేలా ఏడ్చిందట, ఆ పిల్ల అన్నగార్లు మా మావయ్యను కొట్టినంత పనిచేసేసరికి "అవును. అజ్ఞానంలోపడి సంసారం చేయడం కంటె, జ్ఞానంతో తప్పుచేసినా సంతోషమే కదా" అన్నాడు.

మా అత్తయ్య పిల్లలకు అక్షరం ముక్కలు దిద్దించటానికి ఓ మాష్టార్ని పెట్టింది. పెద్ద చదువులేం కావు- అక్షరాలు దిద్దించటం, ఒంట్లు వేయించటం, నెమ్మదిగా పుస్తకం పట్టించటం కోసం ఆ బక్క పంతుల్ని కుదిర్చింది నెలకు ఓ ఫయివ్ రుపీస్‌మీద. ఆ పంతుల్ని చూసి "ఎవరీ పర పురుషుడ"ని మా మావయ్య అడిగాడ్ట. నేను ప్రయివేటు మాష్టర్నండి మహాప్రభో అనాడ్ట వాడు. అక్షరాలు దిద్దించడానికొచ్చావా అసలు నీకు అక్షరాలు ఎలా ఏర్పడ్డాయో తెలుసునా అంటూ "లిపి—దాని పుట్టు పూర్వో త్తరాల గురించి" లెక్చరిచ్చి శబ్ద నిర్మాణశాస్త్రం చదవకుండా అక్షరాలు చెప్పటానికి వీల్లేదని వాడికి తను భాషా శాస్త్రం బోధించటం ఆరంభించా డట. యూనివర్సిటీలైబ్రరీలో మెంబరుగాచేరి తెప్పించుకుని చదవమన్నాడ్ట పుస్తకాలు.

పట్టుచీర కొనమని మా అత్తయ్య అడగటానికి పాపం భయపడు తుంది. పట్టు పరిశ్రమ గురించి అప్పచెప్పమంటాడేమోనని ఆవిడ భయం.

ఇలాగే ప్రతి పనికి మా మావయ్య "సంశయాత్మ— జ్ఞానతృష్ణ అడ్డు రావటంతో మా బంధువర్గంలో జ్ఞాని అంటే చవట పరమ మూర్ఖుడు అనే అభిప్రాయం స్థిరపడిపోయి మా మావయ్యకు "ఆంధ్రా తుగ్లక్" అనే బిరుదు స్థిరపడిపోయింది.

జ్ఞానం పెరిగిన కొద్దీ సంశయం పెరిగేమాట నిజమే — కాదన్ను. జ్ఞానం ఏదో ఒక దిశలో పెరగటం మానేసి శరీరం మాత్రమే పెరుగుతుంది గనుక ఆడవారికి సంశయాలుండవు. అంతలేసి శరీరాల్తో అంత



ప్రమాదకరమైన అవయవశోభతో అంత అమాయకంగా ఎలా వుంటారా ఆడవారని అనిపిస్తుంది. జీవితంలో అమాయకంగా వుండటం కూడా ఒక వరమే. తెలివి తేటలు ఎక్కువయితే ఒక పాలు ఎక్కువ వుంటాయో అక్కడ సుఖం కొంచెం తక్కువగా వుంటుంది. తెలివైన వారు అట్టే సుఖపడలేరు అని దీని తాత్పర్యం. సన్నగా రివటలాసాగి పొడుగ్గా వుండే

వారు కోపంగా చిర్రుబుర్రు లాడుతూ వుంటారు లావుగా గుమ్మడిపళ్ళలా వుండేవారు నవ్వుతూ తుళ్లుతూ ఆసికాలాడుతూ సరదాగా వుంటారు.

నాకో స్నేహితురాలుండేది. ఆ అమ్మాయి చాలా అంద వికారంగా పొడుగ్గా నల్లగా పెద్ద పెద్ద పళ్ళతో పిలకలాటి జడ. జుట్టంతా ఊడి పోయిందా అనిపించేలా అక్కడా అక్కడా నాలుగు వరకలతో చూడ్డానికి చాలా వికారంగా వుండేది. మేమిద్దరం ఎప్పుడూ ఆడుకొనేవాళ్ళం. అది కొరివి దాన్తో నీకు స్నేహమేవిటి అని చాలామంది మందలించారు. కాని దాని మనసు చాలా మెత్తన. చాలా మంచిది, చాలా మధురంగా, కర్ణ పేయంగా పాడుతుంది. దాని పాటకు ముగ్ధుడై దానికి నవ మన్మథుడ్లాటి మొగుడొచ్చాడు. ఆ భర్తకి అదంటే ప్రాణం. చాలామంది ఆడవాళ్ళే వాళ్ళ దాంపత్యాన్ని చూసి నవ్వుకుంటారు. ఆ అబ్బాయిని చూసి జాలిపడ తారు. కాని దాని అదృష్టం ఎవరికివస్తుంది? మాటవరసకి చెప్తాను.దానితో మాట్లాడుతున్నపుడుగాని దాన్ని తలుచుకున్నపుడుగాని దాని మంచితనం దాని పాట గుర్తుకొస్తాయి. కాని దాని రూపంకాదు, ఇంతకీ చెప్పొచ్చేదేవి టంటే రూపం వున్నవారి కందరికీ జ్ఞానం వుంటుందని హామీ ఏమీలేదు.

శరీరాలు ఎదిగి మనసులు ఎదగక మూసుకుపోయిన బాపతు జనం ఆడవారిలోనేకాదు మగవారిలో కూడా హెచ్చుమందేవుండి వుంటారు.

అయితే తుగ్లక్‌లు మగవారిలోనే కాని ఆడవారిలో వుండరా అనే సంశయం నాకోటుంది. ఆడవారికి సంశయాలుండవే పిచ్చిదానా నమ్మకాలే కాని అంటాడు తుగ్లక్ మావయ్య. ఆడవారిలో లేదా మగవారిలో జ్ఞానం వృద్ధిపొంది వెర్రితలలు వేసినపుడు కాని తుగ్లకులు జన్మించరు. అంచేత జ్ఞానమే తక్కువగల ఆడ జనాభానుంచి ఆడ తుగ్లక్ మణులు జన్మించ టానికిప్పటిప్పట్లో అవకాశమే లేదు.

★